www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 26 జులై 2024
5
వైఎస్ఆర్





ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, జడ్జి బాబాఫక్రుద్దీన్

వరిలో కాలిబాటలు ఉపయోగకరం

ప్రజాశక్తి-చెన్నూరు

వరిలో కాలిబాటలు ఏర్పాటు చేసుకోవడం వల్ల ఎన్నో ఉపయోగాలున్నాయని జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఉప్పరపల్లి, చిన్నమాసుపల్లి గ్రామాల్లో రైతులు సాగు చేసిన వరి పంటలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వరినాట్లు పరిశీలించి రైతులు పలు సూచనలు, సలహాలిచ్చారు. వరిలో నాటిన తరువాత ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీమీటర్ల వెడల్పు కాలిబాటలు తూర్పు పడమర దిశలో తీసుకోవాలన్నారు. ఇలా చేయడం వల్ల తక్కువ ఖర్చుతో 3 నుంచి 4 బస్తాలు దిగుబడి అదనంగా పెరిగేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. వాన కాలంలో గాలి తూర్పు, పడమర దిశలో వీస్తుందని, కనుక వరి పంటకు గాలి వెలుతురు బాగా సోకి వరి పంట బాగా దుబ్బు చేయడానికి ఉపయోగపడుతుందని తెలియజేశారు. సుడిదోమ సోకకుండా మొక్క ఆరోగ్యవంతంగా పెరుగుతుందన్నారు. రైతులు ఎరువులు, పురుగుమందులు పిచికారికి సులభతరంగా ఉంటుందని వెల్లడించారు. ఎలుకల బెడదను కూడా తగ్గించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.శ్రీదేవి విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ వరణ్ కుమార్‌రెడ్డి, చెన్నూరు, చిన్నమాసుపల్లి రైతులు పాల్గొన్నారు.


గ్రామసభలో మాట్లాడుతున్న అధికారి

మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం దారుణం

ప్రజాశక్తి-చెన్నూరు

చెన్నూరు మేజర్ పంచాయతీ పరిధిలోని చెన్నూరులో మౌలిక వసతులు కల్పించకపోవడం దారుణమని ప్రజలు వాపోయారు. గురువారం సర్పంచ్ వెంకటసుబ్బయ్య అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పెడపల్లె సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ఇంటి పనులు వసూలు చేస్తున్నారే తప్ప మౌలిక వసతులు కల్పించడం లేదని వాపోయారు. చెన్నూరు కొత్తరోడ్డులో రహదారి, బస్టాండ్‌లో టీ అంగళ్లు, మాంసపు దుకాణాలున్నాయని, వీటి వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. చెన్నూరుకు చెందిన మరో వ్యక్తి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కొత్త రోడ్డులో రహదారి దాటుకోవాలంటే ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. హైవే అధికారులు ఎటువంటి సదుపాయాలు ఏర్పాటు చేయలేదని తెలిపారు. దీనివల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటాయన్నారు. సమావేశంలో ఇఒపిఆర్‌డి సురేష్ బాబు స్పందిస్తూ కొత్త రోడ్డుపై బస్‌షెల్టర్ ఏర్పాటుకు హైవే అధికారులు ముందుకు రానిపక్షంలో చెన్నూరు గ్రామపంచాయతీ నిధులతోనే బస్సు షెల్టర్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. చెన్నూరు కొత్త రోడ్డులోని మాంసం దుకాణదారులకు, బస్టాండ్‌లోని టీ అంగళ్లు, ఇతర దుకాణదారులకు నోటీసులు పంపుతామని చెప్పారు. తాగునీరు, పారిశుధ్యం, వ్యాధులపై చర్చించేందుకే ఒటిఎఫ్ గ్రామసభను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో .ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీర్ వినోద్ కుమార్, డ్వాక్రా ఎపిఒ గంగాధర్, చెన్నూరు మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి, విఆర్‌ఒ శ్రీనివాసులు, సచివాలయ కార్యదర్శి సుప్రియ, హెల్త్ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మైదానంలో హ్యాండ్ బాల్ కోర్టుకు చోటు కల్పించండి

ప్రజాశక్తి - కడప


కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న చిన్నపరెడ్డి

కడప జిల్లా క్రీడాప్రాధికార సంస్థ మైదానంలో హ్యాండ్ బాల్ క్రీడకు చోటు కల్పించాలని జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు లయన్ కె. చిన్నపరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ శివప్రసాద్ కోరారు. గురువారం కడప నగరంలోని జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ శివశంకర్ లోతేటి, జాయింట్ కలెక్టర్ అతిథిసింగ్‌ను వేర్వేరుగా కలిసి శుభాకాంక్షలు తెలి యజేయడంతో పాటు హ్యాండ్‌బాల్ క్రీడకు సంబంధించిన స్థలకేటాయింపు విషయమై విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్టీపర్పస్ క్రీడామైదానంగా ఉన్న డిఎస్‌ఎ మైదానంలో హ్యాండ్‌బాల్ క్రీడకు చోటు కల్పిం చాలని కోరారు. 25 సంవత్సరాలుగా కడప నగరంలో హ్యాండ్‌బాల్ శిక్షణ సాగుతోందని, గతంలో హ్యాండ్‌బాల్ అకాడమీ సైతం ఇదే మైదానంలో నిర్వహి ంచారన్నారు. అసోసియేషన్ సైతం ఎంతో చురుగ్గా క్యాంపులు నిర్వహిస్తూ ఉందన్నారు. ఇలాంటి తరుణంలో హాకీ కోర్టు నిర్మాణం పేరుతో హ్యాండ్‌బాల్ క్రీడకు మైదానంలో చోటు లేకుండా చేశారని పేర్కొన్నారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ పరిశీలించి తగు నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారుడు నాగేంద్ర పాల్గొన్నారు.

అమ్మాయిలు రక్తదానం చేయడం భేష్

ప్రజాశక్తి-కడప అర్బన్

రక్తదానం అబ్బాయిలే కాకుండా అమ్మాయిలు కూడా చేసి ఇలాంటి రక్తదాన కార్యక్రమాలలోనూ మేము ఏమాత్రం తీసుకోమని నిరూపించడం ఎంతో గొప్ప విషయమని సోషల్ వెల్ఫేర్ డిడి సరస్వతీ అన్నారు. కడప స్వచ్ఛంద సేవా సంస్థలు, నెహ్రూ యువ కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రక్త వారోత్సవాల్లో భాగంగా జెబివిఎస్ ది ప్రజర్వర్ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక వివేకానంద ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పుడున్న రక్తం కొరతను తెలుసుకుని రక్తదానం చేయడం అభినందనీయమని చెప్పారు. వైవీయూ ఎన్ఎస్ఎస్ కో - ఆర్డినేటర్ వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ రక్తదానం చేయాలంటే ఆరోగ్యకరంగా ఉండే 18 నుంచి 60 ఏళ్ల మధ్య వయసు కలిగి, 45 కేజీల బరువుతో 12 పాయింట్లు హిమోగ్లోబిన్ ఉన్న యువతీ యువకులు, పెద్దలు రక్తదానం చేస్తే ఎన్నో గొప్ప ఆరోగ్య లాభాలు ఉన్నాయని తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ మనోహర్ రెడ్డి మాట్లాడుతూ రక్తం ఆవశ్యకతను దృష్టిలో ఉంచుకుని సంవత్సరానికి రెండు, మూడు సార్లు తమ కళావాలలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సేవా సమితి వ్యవస్థాపకులు అశోక్ అన్నారు. కళాశాల సిబ్బంది సంస్థ సభ్యులైన కాశి, సుస్మిత, హర్షిత, ఈశ్వరయ్య, మహిళా రక్తదాతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న డిడి సరస్వతి

జిల్లాను టాప్-5లో నిలపాలి

- కలెక్టర్ శివశంకర్ లోతేటి

ప్రజాశక్తి - కడప


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి, హాజరైన జెసి అదితిసింగ్, ఇతర శాల అధికారులు

ప్రాధాన్యత రంగాలను అన్నివిధాలా పటిష్టం చేసి రాష్ట్రంలో జిల్లాను టాప్-5లో నిలపాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్లో జెసి అదితిసింగ్‌తో కలిసి జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా రంగాల్లో జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలు, పనుల పురోగతి, సాధించిన ప్రగతి తదితర అంశాలపై కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్షించారు. వ్యవసాయ శాఖ పరిధిలో జిల్లాలో ఖరీఫ్ సాగుబడిని పెంచడంతో పాటు అధిక దిగుబడులను సాధించేలా యాజమాన్య పద్ధతులను రైతులు పాటించేలా అవగాహన పెంచాలన్నారు. ప్రతి రైతు కూడా సాగుచేసే పంటలను ఈ-క్రాప్ బుకింగ్‌తో పాటు.. ఇకెవైసి ప్రక్రియను పూర్తి చేయించాలన్నారు. ప్రతి గ్రామ సచివాలయ పరిధిలోని రైతు సేవా కేంద్రాల (ఆర్‌ఎస్‌కె) ద్వారా వ్యవసాయ, ఉద్యాన రంగ సేవలను విస్తృతం చేయాలన్నారు. ఖరీఫ్ సీజన్‌కు సరిపడా ఎరువులు, పురుగు మందులు కొరత లేకుండా నిల్వలు ఉంచాలన్నారు. గ్రామస్థాయిలో అధికారులు రైతులతో మమేకమై వారికి సలహాలు, సూచనలు అందించాలన్నారు. జిల్లాలో అధిక శాతం ఉద్యాన పంటలు సాగులో ఉండడంతో సంబంధిత అధికారులు ఆయా పంటలపై ప్రత్యేక దృష్టి సారిం చాలన్నారు. అరటి, బత్తాయి, మామిడి తోటల సం రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ఉద్యాన పంటల సాగుబడిని పెంపొందించేందుకు రైతుల్లో అవగాహన పెంచాయాలన్నారు. ప్రభుత్వం పాంశాలల్లో ప్రవేశపెడుతున్న 'న్యూట్రీ గార్డెన్స్' సాగుబడికి విద్యశాఖాధికారుల సమన్వయంతో మంచి ఫలితాలను తీసుకురావాలన్నారు.. పశుసంవర్ధక శాఖను మరింత విస్తృతం చేసూపాడి పరిశ్రమ, పౌల్ట్రీ, గొర్రెలు, మేకల పెంపకందార్లను ఆర్థికంగా ముందుకు నడిపే సహాయ సహకారాలు అందించాలని తెలిపారు. జిల్లా పౌరసరఫరాల శాఖ ద్వారా జిల్లాలోని అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా సజావుగా, రైతులకు ఎలాంటి ఇబ్బం దులు లేకుండా వరి, ఇతర రబీలో పండిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు సన్నద్ధం కావాలన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు అమలు చేస్తున్న అన్ని రకాల సంక్షేమ పథకాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ అధికారులకు సూచి ంచారు. జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేలా బ్యాంకు అధికారులు కృషి చే యాలన్నారు. అనంతరం వ్యవసాయ అనుబంధ శాఖలకు సంబంధించి మండల స్థాయిలో స్థితి గతులను ఆయా అధికారులను అడిగి తెలుసుకుని పలు సూచనలిచ్చారు. సమావేశంలో జిల్లా వ్యవ సాయ శాఖ అధికారి నాగేశ్వరరావు, ఎపిఎంఐపి పడీ రవీంద్రారెడ్డి, డిసిఒ సుభాషిణి, హార్టికల్చర్, సిరి కల్చర్, పశుసంవర్ధక శాఖ, ఫిషరీస్, మార్కెటింగ్, ప్రాధాన్యత రంగాలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

దర్యాప్తు వేగవంతం


వర్షంలోనూ అర్జీలు స్వీకరిస్తున్న ప్రత్యేక సిఎస్ సిసోడియా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయం అగ్నికి ఆహుతైన ఘటన సందర్భంగా పలు కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. పెద్ద ఎత్తున భూ కుంభ కోణాలకు పాల్పడిన వారు రికార్డులను మాయం చేసే క్రమంలో సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని తగలబెట్టారన్న ఆరోపణల నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ సంఘటనను తీవ్రంగా పరిగణించారు. తన హెలికాప్టర్లో రాష్ట్ర డిజిపి ద్వారకా తిరుమలరావు, సిఐడి చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్‌లను హుటాహుటిన మదనపల్లెకి పంపిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో కార్యాలయాన్ని పరిశీలించిన డిజిపి, సిఐడి చీఫ్‌లు కార్యాలయాన్ని ఉద్దేశపూర్వకంగా తగలబెట్టారని, ఇందులో కుట్రకోణం దాగి ఉందని నిర్ధారణ చేశారు. అప్పటినుంచి మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయ పరిధిలో ఉన్న 11 మండలాల తహాశీల్దార్ కార్యాలయాల్లో రికార్డుల పరిశీలనను వేగవంతం చేశారు. వివిధ హోదాలో ఉన్న రాష్ట్ర స్థాయి అధికారులు మదనపల్లెకు వచ్చి క్షేత్ర స్థాయిలో దర్యాప్తు చేపట్టారు. మూడు రోజులుగా రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలోనే మకాం వేసి అన్ని కోణాల్లోనూ దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ నేపథ్యంలో గత మూడేళ్ల కాలంలో భూ సమస్యలపై ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాదితులు, భూములు కోల్పోయిన వారు, మరే ఇతర కారణాల వల్ల భూ వివాదాల్లో తలమునకులై ఇబ్బందులు పడుతున్న వారు తమ అర్జీలను సమర్పించాల్సిందిగా రెవెన్యూ శాఖ పిలుపునిచ్చింది. ఈ పిలుపు అందుకున్న వందల మంది బాధితులు గురువారం మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయానికి పోటెత్తారు. సరిగ్గా నాలుగు గంటలకు సబ్ కలెక్టర్ కార్యాలయం గేట్లు తెరవడంతో ఒక్కసారిగా లోపలికి పరుగులు పెట్టారు. ఇదే సమయంలో జోరువాన కురవడంతో అర్జీదారులు వెనుకడుగు వేయలేదు. తమకు ఖచ్చితంగా న్యాయం జరుగుతుందన్న నమ్మకంతో వర్షంలో సైతం తమ సమస్యలను పెద్ద అధికారికి విన్నవించుకోవడానికి పోటీపడ్డారు. అర్జీదారులను ఏమాత్రం నిరాశపరచకుండా సిసోడియా సైతం బయటకు వచ్చి జోరు వానలోనూ అర్జీదారులు, ప్రజల నుంచి సిసోడియా, అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్‌లు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రతి అర్జీలోనూ ఫోన్ నెంబర్ రాసి అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు అర్జీదారులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ళుగా నలిగిపోతున్నాం, ఇప్పటికైనా మా సమస్యకు పరిష్కారం దొరుకుందని ఆశగా ఉన్నామని ఎంతో ఆశగా చెప్పడం వారి ఆవేదనను తెలియజేస్తోంది.

ఘటనపై సమీక్షించిన సిఐడి చీఫ్

అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల దహనం కేసులో దర్యాప్తు వేగవంతంగా జరుగుతోంది. ఎపి సిఐడి చీఫ్ రవిశంకర్ అయ్య న్నార్ గురువారం మదనపల్లెకు చేరుకున్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయ్యాన్ని ఆయన పరిశీలించారు. కేసు పురోగతిపై ఆయన సమీక్షించారు.

కొన్న భూమిలో అరచకాలు సృష్టిస్తున్నారు

సిటిఎం వద్ద 810 సర్వే నెంబర్‌లో ఎకరా పొలాన్ని కొన్నాం. కొన్నప్పటి నుంచి వైసిపి సర్పంచ్‌లు ఆక్రమించుకునేందుకు రూ.లక్షల ఖర్చు పెట్టి వేసిన ఫెన్సింగ్‌ను కూల్చేశారు. మా స్థలాన్ని శ్మశాన వాటికగా మార్చేసి అందులో చనిపోయిన వారిని పూడ్చి పెట్టారు. వైసిపి నాయకుల అరచకాలకు అధికారులు వంత పాడారు. ఇప్పుడైనా న్యాయం జరుగుతుందని వచ్చాను.

- యేసువర్ధన్, మదనపల్లె.

డికెటి భూమిని ఆక్రమించారు

మా నాన్న మల్లప్పకు వలసపల్లి వద్ద 1986లో 2.73 ఎకరాల వ్యవసాయ భూమిని ప్రభుత్వం డికెటి పట్టా వచ్చింది. అందులో వ్యవసాయం చేసుకుంటూ జీవనం చేస్తున్నాం. నేను వికలాంగుడిని. ఆరు నెలల క్రితం వైసిపి నాయకుడు మాధవరెడ్డి మా భూమికి కంచె వేసి అందు లోనికి రానివ్వకుండా భయభ్రాంతులనకు గురిచేస్తు న్నాడు. నాకు న్యాయం జరుగుతుందని వచ్చాను

- భాస్కర్, వలసపల్లి.

సెంటున్నర స్థలాన్ని వదల్లేదు

నాకు 2014లో జన్మభూమి ప్రోగ్రామ్‌లో ఇంటి నిర్మాణం కోసం సెంటున్నర స్థలాన్ని ఇచ్చారు. ఆ స్థలంలో ఇళ్లు కట్టుకోనివ్వకుండా తంబళ్లపల్లె వైసిపి ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి అధికారుల ద్వారా తీవ్ర ఇబ్బందులు పెడుతున్నాడు. నా ఇంటిని పడేసేందుకు వచ్చిన అధికారులను అడ్డుకున్నందుకు నాపై అక్రమంగా మూడు కేసులు పెట్టారు. ఇప్పటికైనా న్యాయం జరుగుతుందని ఆశగా వచ్చాను.

- సునీత, ములకలచెరువు.

విద్యా సదస్సును జయప్రదం చేయండి : యుటిఎఫ్

ప్రజాశక్తి - కడప అర్బన్

యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 28న ఉదయం 10 గంటలకు నిర్వహించే రాష్ట్రస్థాయి విద్యాసదస్సును జయప్రదం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి రాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు కోరారు. గురువారం రాష్ట్ర విద్యా సదస్సుకు సంబంధించిన కరపత్రాలు యుటిఎఫ్ భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యుటిఎఫ్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తికావస్తున్న సందర్భంగా రాష్ట్రమంతటా స్వర్ణోత్సవాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగా వివిధ జిల్లాలలో సమకాలీన అంశాలపై రాష్ట్రస్థాయి సదస్సులు నిర్వహించి ఉపాధ్యాయులను చైతన్య పరుస్తారని పేర్కొన్నారు. 2024, మేలో సార్వత్రిక ఎన్నికలు జరిగిన నేపథ్యంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని చెప్పారు. రాష్ట్ర పరిస్థితులను శ్వేత పత్రాల రూపంలో ప్రభుత్వం ముందుకు తీసుకొస్తున్నదని, వీటిలో వాస్తవ విషయాలు తెలియజేస్తామని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో దేశ, రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై అవగాహన కలిగించే నిమిత్తం ఈనెల 28న ఉదయం 10 గంటలకు శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల బాలాజీ నగర్ లో రాష్ట్ర విద్యా సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్క వెంకటేశ్వరు హాజరవుతారన్నారు. 'రాష్ట్ర ఆర్థిక శ్వేత పత్రం- వాస్తవాలు' అనే అంశంపై వి.రాంభూపాల్ ' ప్రత్యామ్నాయ విద్యా విధానం ' అనే అంశంపై యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్ ప్రసాద్ వివరిస్తారని పేర్కొన్నారు.

కొనసాగుతున్న అండర్-19 క్రికెట్ టోర్నీ

- మొదటి ఇన్నింగ్స్‌లో వెస్ట్ గోదావరి 306/9

ప్రజాశక్తి - కడప

వై.ఎస్. రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో జరుగుతున్న మ్యాచ్‌లో వెస్ట్ గోదావరి జట్టు 9 వికెట్ల నష్టానికి 306 పరుగులు చేసింది. 19 ఓవర్లలో 28 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో రెండవ రోజు బ్యాటింగ్ ప్రారంభించిన వెస్ట్ గోదావరి జట్టు ఆట ముగిసే సమయానికి 116 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 306 పరుగులు చేసింది. ఆ జట్టులోని ప్రణీత్ పవన్ 92, రేవంత్ నాగ కుమార్ 63 పరుగులు చేశారు. కడప జట్టులోని ఏ. నాగ కుళ్లాయప్ప అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 5 వికెట్లు తీసుకున్నాడు. ప్రణవ్ కుమార్ రెడ్డి 2 వికెట్లు తీసుకున్నాడు.

భారీ స్కోరు సాధించిన విశాఖపట్నం.. కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో జరుగుతున్న మ్యాచ్‌లో ఈశ్వర్ రిత్విక్, హృతిక్ వర్మ సెంచరీలు చేయడంతో విశాఖపట్నం జట్టు 391 పరుగుల భారీ స్కోరు సాధించి డిక్లేర్ చేసింది. రెండవ రోజు బ్యాటింగ్ ప్రారంభించిన విశాఖపట్నం జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 69.4 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 391 పరుగుల భారీ స్కోరు చేసి డిక్లేర్ ప్రకటించింది. ఆ జట్టులోని జి. ఈశ్వర్ రిత్విక్ 124 పరుగులు (సెంచరీ), హృతిక్ వర్మ 146 పరుగులు (సెంచరీ) చేశారు. చిత్తూరు జట్టులోని బాలాజీ 3, మొహమ్మద్ ఉమర్ 2, ధనుష్ రెడ్డి 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు రెండవ రోజు ఆట ముగిసే సమయానికి 18.0 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 65 పరుగులు చేసింది. లోహిత్ లక్ష్మీనారాయణ 29 పరుగులు (నాటౌట్) చేశాడు. విశాఖపట్నం జట్టులోని పి.డి. రచిత్ 2 వికెట్లు తీసుకున్నాడు.

407 పరుగులు చేసిన శ్రీకాకుళం.. కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో జరుగుతున్న మ్యాచ్‌లో నాలుగు వికెట్ల నష్టానికి 262 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో రెండవ రోజు బ్యాటింగ్ ప్రారంభించిన శ్రీకాకుళం జట్టు 98.1 ఓవర్లలో 407 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని ఎన్. సుశాంత్ 127 పరుగులు (సెంచరీ) చేశాడు. పి. సిద్దు విగ్నేష్ 58 పరుగులు చేశాడు. నెల్లూరు జట్టులోని భార్గవ్ మహేష్ 4,ఎస్.ఎస్. హమీద్ 3 వికెట్లు తీసుకున్నారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు రెండవ రోజు ఆట ముగిసే సమయానికి 51.0 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 220 పరుగులు చేసింది. ఆ జట్టులోని కారుణ్య ప్రసాద్ 43, అర్జున్ 43 (నాటౌట్) పరుగులు చేశారు. శ్రీకాకుళం జట్టులోని సిద్దు విగ్నేష్ 2, జున్నారావు 2 వికెట్లు తీసుకున్నారు.


తలపడుతున్న కడప, వెస్ట్ గోదావరి జట్లు

నిర్లక్ష్యం వీడి హెల్మెట్‌ను ధరించాలి

- జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్

ప్రజాశక్తి - కడప

నిర్లక్ష్యం వహించకుండా ప్రతి ద్విచక్ర వాహన దారులు హెల్మెట్‌ను ధరించి సురక్షితంగా తమ గమ్యస్థానాలను చేరుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ అన్నారు. గురువారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కెఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాల నుంచి పులివెందుల రోడ్డు సర్కిల్ వరకు, బిల్డప్ నుంచి రెండవ గాంధీ బొమ్మ వరకు ర్యాలీ సాగింది. ర్యాలీని జడ్జి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోటారు వాహనాల చట్టంలోని సెక్షన్ 129 ప్రకారం, బైక్ నడుపుతున్నప్పుడు 4 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉన్న వ్యక్తులందరూ రక్షణాత్మక తలపాగా ధరించాలి అని సూచించారు. రైడర్, వారి ప్రయాణికుడు ఇద్దరూ హెల్మెట్‌లను ధరించాలి అని అన్నారు. సెక్షన్ 194 డిఎంవి యాక్ట్ హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేస్తే రూ. 1000 వరకు జరిమానా, డ్రైవింగ్ లైసెన్స్ మూడు నెలల పాటు రద్దు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో చింతకొమ్మదిన్నె సిఐ శంకర్ నాయక్, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ పోలీస్ సిబ్బంది, పారా లీగల్ వాలంటరీలు జె. సురేష్ సహాయం, జెఎల్ శ్రీనివాసరావు, లక్ష్మీ భవాని, ఎన్‌జిఒలు, కెఎస్ఆర్ఎం, శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, కళాశాల ప్రొఫెసర్లు, ప్రజలు పాల్గొన్నారు.


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న అలీఖాన్

'సీమ' జిల్లాల్లో ప్రభుత్వ భూములు కబ్జా

ప్రజాశక్తి - కడప

రాయలసీమ ప్రాంత జిల్లాలలో వైసిపి పార్టీ ప్రభుత్వ హయాంలో 14,063 ఎకరాల ప్రభుత్వ భూములు కబ్జాకు గురైనట్లు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మైనార్టీ విభాగపు ఉపాధ్యక్షులు పఠాన్ మహమ్మద్ అలీఖాన్ ఆరోపించారు. కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల తర్వాత ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని తెలిపారు. వీలైనంత త్వరగా భూకబ్జాకు గురైన భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఇందుకుగాను ఆరు నెలల పరిమితి కాలం విధించి జిల్లాల వారీగా న్యాయ విచారణ కమిషన్లు ఏర్పాటు చేసి ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలని కోరారు. చిత్తూరు జిల్లాలో సుమారు 982 ఎకరాలు, కడప జిల్లాలో 5, 796 ఎకరాలు, కర్నూలు జిల్లాలో 1, 145 ఎకరాలు, అనంతపురం జిల్లాలో 5,554 ఎకరాలను దురాక్రమణ చేశారని ఆరోపించారు. అన్నమయ్య జిల్లాలో 103.15 ఎకరాలు ప్రభుత్వ భూమిని కబ్జా చేశారని వెల్లడించారు. నంద్యాల జిల్లాలో 483 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నారని వాపోయారు. రాష్ట్రంలో అత్యంత కట్టుదిట్టమైన భద్రతలో ఉండాల్సిన రికార్డులు మాయం కావడం, మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ రికార్డులు కాల్చివేసిన ఉదంతాలను ఖండిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు వై.ఎస్. భూ కబ్జాలు భూమి అన్యాక్రాంతం పై ప్రభుత్వాన్ని హెచ్చరించారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం అలసత్వం వీడి అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను కాపాడి వాటికి సంబంధించిన రెవెన్యూ రికార్డుకు భద్రత కల్పించాలన్నారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్ పి. ఎం. రహమతుల్లా ఖాన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు చిన్న కులయప్ప, రఫీఖాన్ పాల్గొన్నారు.

విఆర్‌ఎలకు నైట్ వాచ్‌మెన్ విధులు దుర్మార్గం

ప్రజాశక్తి - కడప అర్బన్ : సిద్ధపటం మండలంలోని తహశీల్దార్ విఆర్‌ఎలను నైట్ వాచ్‌మెన్ విధులు నిర్వహించాలని ఆదేశించడం దుర్మార్గమని, అలాంటి ఆదేశాలను రద్దు చేయాలని విఆర్‌ఎల యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు బి.మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కాలంలో విఆర్‌ఎలు చేసిన పాత్ర గొప్పదని పేర్కొన్నారు. అయినప్పటికీ చాలామందికి ఎన్నికల కాలంలో పనిచేసిన వారికి డబ్బులు రాలేదని తెలిపారు. ఇప్పుడు సిద్ధవటం మండలం తహశీల్దార్ విఆర్‌ఎలను వాచ్‌మెన్‌గా చేయాలని, లేకపోతే ఇబ్బందులు తప్పవని భయాందోళనకు గురిచేయడం అన్యాయమన్నారు. వారి ఇచ్చే వేతనం చాలా తక్కువని, అర్హులైన వారిని వాచ్‌మెన్, అటెండర్, డ్రైవర్స్, విఆర్‌ఒలుగా ప్రమోషన్స్ ఇవ్వాల్సిన అవసరం ఉందని తెలిపారు. కానీ అలాంటి పని చేయకపోగా నైట్ వాచ్‌మెన్‌గా విధులు చేయాలని ఇచ్చిన ఆర్డర్లను తహశీల్దార్ వెంటనే రద్దు చేయాలని పేర్కొన్నారు. లేనిపక్షంలో ఈ విషయాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

ఉక్కు పరిశ్రమ వచ్చే వరకూ పోరాడుతాం

ప్రజాశక్తి - బద్వేలు

కడప జిల్లాకు ఉక్కు పరిశ్రమ వచ్చేంతవరకు పోరాడుతామని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని పేర్కొన్నారు. గురువారం ఉదయం పట్టణంలోని సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాటారు. ముందుగా డివైఎఫ్ఐ రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ నాలుగు రోజులు పాటు జరిగే క్లాసులో రాష్ట్రం మొత్తం నాయకత్వం హాజరు అవుతారని అన్నారు. ముఖ్యంగా భవిష్యత్ కార్యాచరణ అజెండాగా తీసుకొని ముందుకు సాగుతామని అన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కడప ఉక్కు పరిశ్రమకు నిధులు కేటాయించకపోవడం దారుణం అన్నారు. కరువు వలసలతో అల్లాడుతున్న రాయలసీమ ప్రాంతానికి కరువు, వలసల నివారణకు కడప ఉక్కు పరిశ్రమనే ఏకైక మార్గం అన్నారు. జిల్లాలోని యువత రాష్ట్ర క్లాసులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్ర మంలో డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.కె. మస్తాన్, షరీఫ్, గంగనిపల్లి నాగార్జున, రూరల్ అధ్యక్షులు ఓబుల్‌రెడ్డి, మహిళా కో-కన్వీనర్ నాగలక్ష్మి పట్టణ నాయకులు ఆంజనేయులు, నాగేంద్ర, రామకృష్ణ పాల్గొన్నారు.

30 శాతం కేటాయించడం హర్షణీయం

ప్రజాశక్తి-కాశినాయన

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత జనసేన పార్టీకి ప్రతి అంశంలోనూ 30 శాతం కేటాయించడం హర్షణీయమని ఆ పార్టీ మండల కన్వీనర్ ఖలీల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డీలర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, నామినేటెడ్ పోస్టులు వంటి వాటిలో జనసేనకు వాటా కల్పించడం శుభపరిణామన్నారు. మండలంలో జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో యువత పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

నాకు సెక్యూరిటీ అవసరం లేదు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కడప అర్బన్

కనీస సమాచారం ఇవ్వకుండా తనకున్న 2 ప్లస్ 2 గన్ మెన్లను 1 ప్లస్ 1కు కుదించారని, తన భర్త రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డికి ఉన్న 1 ప్లస్ 1 సెక్యూరిటీని పూర్తిగా తొలగించారని, తనకు అసలు సెక్యూరిటీనే అవసరం లేదు అంటూ కడప ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవి పేర్కొన్నారు. ఆమెకు కేటాయించిన సెక్యూరిటీని వెనక్కు పంపారు. సెక్యూరిటీ కుదిస్తూ పోలీసు అధికారులు తీసుకున్న ఈ నిర్ణయం కడప రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. కడప శాసనసభ స్థానం నుంచి టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి సతీమణి మాధవి సార్వత్రిక ఎన్నికల్లో మాజీ ఉప ముఖ్యమంత్రి, వైసిపి అభ్యర్థి అంజాద్‌బాషాపై 18 వేల మెజారిటీతో విజయం సాధించారు. ఎన్నికలకు ముందు ప్రత్యర్థి పార్టీ అభ్యర్థి తమ్ముడి నుంచి తనకు ప్రాణహాని ఉందని పోలీసులను కోరడంతో ఆమెకు, ఆమె భర్త శ్రీనివాసరెడ్డికి సెక్యూరిటీని కేటాయించారు. తాజాగా ఎలాంటి సమాచారం ఇవ్వకుండా గన్ మెన్లను తొలగించడంతో ఆమె మనస్తాపానికి గురై మొత్తానికే సెక్యూరిటీ అవసరం లేదంటూ తిప్పి పంపి శాసనసభ సమావేశాలకు హాజరవుతుండడం కలకలం రేపుతుంది. జగన్ సొంత ఇలాకా అయిన కడపలో మాధవి విజయం సంచలనంగా మారింది. ఈ విషయంలో పోలీసులు ఎలా స్పందిస్తారు అన్నది వేచిచూడాలి.



మాట్లాడుతున్న డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్

కేంద్ర బడ్జెట్‌లో కడప ఉక్కుకు అన్యాయం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో కడప ఉక్కుకు నిధులు కేటాయించకపోవడం అన్యాయమని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్రం మరోమారు కడప ఉక్కుపై తీవ్ర వివక్షత చూపించిందన్నారు. గడిచిన పదేళ్లలో ఒక్కసారి కూడా బడ్జెట్లో కడప ఉక్కుకు నిధులు కేటాయించలేదన్నారు. కనీసం ఈసారైనా నిధులు కేటాయిస్తారేమోనని ఇక్కడి ప్రాంత యువత ఎదురుచూశారని, కానీ వారికి నిరాశే ఎదురైందన్నారు. కడపఉక్కు మహాశక్కు.. విభజన హామీల్లో ప్రధానమైందన్నారు. కేంద్రం పూర్తిగా హామీని విస్మరించిందన్నారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వంపై కేంద్రం ఆధారపడిందని, ఇప్పుడైనా కేంద్రంపై ఒత్తిడి తెచ్చి కడపఉక్కు పరిశ్రమ కు నిధులు రాబట్టి పరిశ్రమ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరారు. ఇక్కడి వనరులు, కరువు నివారణకు కడప ఉక్కు ఏకైక మార్గం అన్నారు. నందర్భాలలో జరిగే డివైఎఫ్ఐ రాష్ట్ర తరగతుల్లో కడప ఉక్కు ఆశిందగా చర్చిస్తామన్నారు. సమావేశంలో ప్రొద్దుటూరు డివైఎఫ్ఐ పట్టణ నాయకులు విశ్వనాథ్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఎపికి కేంద్రం మోసపూరిత బడ్జెట్ : సిపిఎం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

కేంద్ర ప్రభుత్వం ఎపికి మోసపూరిత బడ్జెట్ కేటాయించిందని సిపిఎం కార్యదర్శి జి ఏసుదాసు, పార్టీ కమిటీ సభ్యులు దాసరి విజయ్ తెలిపారు. స్థానిక ఎన్జీఓ హోంలో గురువారం వారు మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రూ.48 లక్షల కోట్లు కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టి, అందులో ఏపికి మాత్రం వరల్డ్ బ్యాంకు నుండి రూ.15 వేల కోట్లు అప్పు ఇప్పిస్తున్నామంటూ స్వయాన కేంద్ర ఆర్థిక మంత్రి చెప్పడం చాలా దుర్మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వానికి ఆంధ్రప్రదేశ్ ప్రజలపైన ఏమాత్రం గౌరవం లేదన్నారు. ఎన్డిఎ కూటమి నుంచి టిడిపి ప్రభుత్వం బయటకు రావాలన్నారు. బిజెపి ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉంది అంటే ఆంధ్రప్రదేశ్ ప్రజల భిక్ష అన్నారు. రాష్ట్ర ప్రజల తరఫున ఏపీలో ఉన్న అన్ని రాజకీయ పార్టీలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఏ వినయ్‌కుమార్, బాషా, శీను, కరిముల్లా పాల్గొన్నారు.

ఫసల్ బీమా పాత పద్ధతిలో అమలు చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

రైతులు సాగు చేస్తున్న పంటలకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకాన్ని పాత పద్ధతిలో అమలు చేయాలని వైసీపీ రైతు విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి మస్తాన్‌రెడ్డి కోరారు. వేంపల్లెలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ఎన్డిఏ కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందని చెప్పారు. అందులో ఫసల్ బీమాను పాత పద్ధతిలో అమలు చేయడంతోపాటు ఇన్సూరెన్స్ కల్పిస్తామని ప్రకటించిందన్నారు. బ్యాంకులో రెన్యూవల్ చేసుకున్న రైతులకు ఫసల్ బీమా కింద జులై 31లోగా ప్రీమియం చెల్లించడం జరిగిందని చెప్పారు. ఆగస్టు 15 తేదీలోపు వర్షాలు రాకపోతే.. పంట సాగు చేయకపోతే అలాంటి రైతులకు పిఎం ఫసల్ బీమా కింద రూ.8,250 ప్రకారం మంజూరు అయ్యేదని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో రైతులకు ఇచ్చిన హామీ మేరకు పాత పద్ధతిలోనే ఫసల్ బీమా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

పాలిసెట్-24 రాయని వారికి నేరుగా ప్రవేశం

- ప్రిన్సిపల్ గురుమూర్తిరెడ్డి

ప్రజాశక్తి - మైదుకూరు

మైదుకూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ పి.గురుమూర్తిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదవ తరగతి విద్యార్థులు పాలిసెట్ ఎంట్రన్స్ పరీక్షలు రాయనివారికి కూడా స్పాట్ అడ్మిషన్లలో హాజరు కావచ్చని తెలిపారు. ఈనెల 31న స్పాట్ అడ్మిషన్ల ద్వారా డిప్లమా కోర్సులకు ప్రవేశం కల్పించనున్నట్లు ప్రిన్సిపల్ తెలిపారు.



కన్నెలూరులో ప్రారంభించిన ఆధార్ నమోదు కేంద్రం

27 వరకు ఉచిత ఆధార్ కేంద్రం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఈ నెల 27వ తేదీ వరకు ఉచిత శిశు ఆధార్ కేంద్రం ఉంటుందని, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సీఎస్సీ సెంటర్ నిర్వాహకుడు పొన్నపురెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక కన్నెలూరు అంగన్వాడీ కేంద్రంలో గురువారం ఉచిత ఆధార్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న పిల్లలకు ఆధార్ లేకపోతే తల్లిదండ్రులు వచ్చి తీయించుకోవాలన్నారు. మున్సిపాలిటీ, మండల పరిధిలోని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అన్నింటికీ ఆధార్ ప్రధానమని, ఈ విషయాన్ని తల్లిదండ్రులు గమనించాలని ఆయన కోరారు.

ప్రజా సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

ప్రజాశక్తి - చక్రాయపేట

మండలంలోని ప్రజా సమస్యలు వెంటనే పరిష్కరించాలని గురువారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట మాజీ జెడ్పిటిసి తులసిరెడ్డిని రాధాకృష్ణయ్య, బిజెపి నేషనల్ కౌన్సిల్ మెంబర్ కె.రామచంద్రారెడ్డి నిరసన తెలిపారు. అధికారులు నిర్లక్ష్యం వహించకుండా ప్రజా సమస్యలు పరిష్కరించాలని తహశీల్దార్ బెన్నీరాజుకు కోరారు. ఒకరి భూమును మరొకరికి ఎక్కించారని, కొన్నేళ్లుగా రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులకు చీమకుట్టినట్టు కూడా లేదని మాజీ జెడ్పిటిసి రాధాకృష్ణయ్య ఆరోపించారు. తహశీల్దార్ బెన్నీరాజ్ మాట్లాడుతూ.. మాజీ జెడ్పిటిసి ఫిర్యాదుపై విషయాన్ని ఆర్డిఒకు పంపుతామన్నారు.

ఈదురు గాలులకు దెబ్బతిన్న ఇల్లు

ప్రజాశక్తి - ముద్దనూరు

భీకరంగా వీస్తున్న ఈదురు గాలుల ధాటికి వేపచెట్టు కూలి ఇంటిపై పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొసినేపల్లె గ్రామంలో బుధవారం రాత్రి భీకరంగా వీచిన ఈదురు గాలుల ధాటికి రామిరెడ్డి ఆయమ్మలో ఉన్న 70ఏళ్ల చెట్టు విరిగి శేషనారాయుడు ఇంటి వరండాపై పడింది. రోడ్డుపైన, ఇంటి వరండాలో ఎవరూలేక పోవడంతో పెను ప్రమాదం తప్పింది. రాత్రి వేళ కావడంతో ఆరు బయట ఎవరూ తిరగక పోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

రెండు బైకులు ఢీ : ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - ముద్దనూరు

ముద్దనూరు-కడప ప్రధాన రహదారి తిమ్మాపురం గ్రామ సమీపంలో గురువారం ఎదురెదురుగా రెండు బైకులు ఢీ కొన్న సంఘటనలో పులివెందులకు చెందిన శ్యాంసుందర్‌రెడ్డి, అశోక్ నాయక్ తీవ్రంగా గాయపడ్డారు. తిమ్మాపురం గ్రామ సమీపంలో ఉన్న రమణారెడ్డి లారీ ట్రాన్స్‌పోర్ట్ వద్ద బైకులు ఢీ కొన్నాయి. సంఘటనాస్థలాన్ని సిఐ దస్తగిరి, సిబ్బంది చేరుకుని క్షతగాత్రులను 108లో ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు.

వాహనాలు కొన్నారు.. చెత్త సేకరణ మరిచారు

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించి స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కోసం కొనుగోలు చేసిన వాహనాలు నిరుపయోగం మారాయి. చెత్త నుండి సంపద సృష్టించేందుకు సంపద సృష్టి కేం ద్రాలు నిర్మించడంతోపాటు ఇంటింటా చెత్త సేక రణ కోసం వాహనాల కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమం మున్నాళ్ల ము చ్చటగా మారింది. లక్ష లాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన వా హనాలు మూలకు చేరాయి. మండలం పరిధిలోని అప్పన పల్లె పం చాయతీ మల్లయపల్లె, పుల్లూరు పంచాయతీ రహమత్ ఖాన్‌పల్లె సచి వాలయం వద్ద వాహనాలు మూలన పడ్డాయి. వాహనాలు మూలకు చేరడం తోపాటు విలువైన విడిభాగాలు కూడా కనిపించకుండా పోతున్నాయి. వర్షానికి వాహనాలు తుప్పు పట్టి పో తున్నాయి. చెత్త సేకరణ కోసం కొనుగోలు చేసిన వాహనాలను ఇతర అవ సరాలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకుని వాటిని వినియోగంలోకి తేవాలని, ఇంటింటా చెత్తసేకరణ చేపట్టి స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌కు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



రహమత్‌ఖాన్‌పల్లె సచివాలయం వద్ద మూలకు చేరిన వాహనం

రక్తదానం.. మరొకరి జీవితానికి వెలుగు



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపిడిఒ సంపతి దివిజా

ప్రజాశక్తి - వేంపల్లె

రక్తదానం మరొకరి జీవితానికి వెలుగునిస్తుందని ఎంపిడిఒ సంపతి దివిజా పేర్కొన్నారు. రక్తదాన వారోత్సవాల్లో భాగంగా గురువారం నెహ్రూ యువ కేంద్రం సహకారంతో గంగా రూరల్ ఎన్విరాన్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థులు, పాలిటెక్నిక్ ఉద్యోగులు కలిసి 35మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ రక్తదానం చేయండి-ప్రాణదాతలు అవ్వండి అని ఎన్నో స్వచ్ఛంద సంస్థలు, వైద్యులు పలు అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు చేయడం సంతోషకరమన్నారు. 3 నెలలకు ఒకసారి రక్తదానం చేయొచ్చన్నారు. తద్వారా ఆరోగ్యంగా ఉండడంతోపాటు ప్రమాదకర పరిస్థితుల్లో మరొకరికి ప్రాణదానం చేసిన వారవుతారని చెప్పారు. గంగా రూరల్ ఎన్విరాన్మెంట్ సొసైటీ అధ్యక్షుడు శివకృష్ణ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువకులు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్త దాతలు ముందుకొస్తే ఎన్నో ప్రాణాలను కాపాడవచ్చన్నారు. దేశంలో ప్రతి రెండు సెకండ్లకు ఒకరికి రక్తం అవసరం అవుతుందన్నారు. రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ రెడ్డి, వెటర్నరీ డాక్టర్ సాదిక్ బాషా, మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ విజయ్‌కుమార్, రెడ్‌క్రాస్ స్పెషల్ ఆఫీసర్ శివశంకర్, ఎన్‌వికె వాలంటీర్లు సుబ్బయ్య, కృష్ణతేజ, స్నేహిత అమృత హస్తం ఛైర్మన్ రాజు, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ హేమంత్‌కుమార్ రెడ్డి, సిబ్బంది లావణ్య, చిన్నగురప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్'ను వెంటనే అమలు చేయాలి

- పిసిసి మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

టిడిపి కూటమి ఎన్నికల్లో చెప్పిన సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని పిసిసి మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి అన్నారు. గురువారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు ప్రధాన కారణమైన సూపర్ సిక్స్ పథకాలని అమలు చేయడంలో నిర్లక్ష్యం చేయడం మంచిది కాదన్నారు. సూపర్ సిక్స్ పథకాలు ఎప్పటి నుండి అమలు అవుతాయో రాష్ట్ర ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నప్పటి నుండి కేవలం సామాజిక ఫించన్ మాత్రమే అమలైందన్నారు. తల్లికి వందనం పథకానికి సంబంధించి కూటమి ప్రభుత్వం పదేపదే మాట తప్పుతోందని విమర్శించారు. పాఠశాలకు వెళ్లే ప్రతి విద్యార్థికి రూ.15 వేలు అని మేనిఫెస్టోలో చెప్పిందన్నారు. జులై 9న విడుదల చేసిన జిఒ 29 మేరకు విద్యార్థికి బదులు తల్లికి అని పేర్కొన్నట్లు ఉండడం దుర్మార్గమని తులసిరెడ్డి అన్నారు. విమర్శలు రావడంతో ప్రభుత్వం పొరపాటు జరిగిందని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. తల్లికి వందనం వచ్చే ఏడాది నుంచి అమలు చేస్తామని మోసం చేసిందని మండిపడ్డారు.

తల్లికి వందనం పథకాన్ని ఈ ఏడాది నుంచే అమలు చేయాలని ఆయన కోరారు. యువతకు నెలకు రూ.3 వేల నిరుద్యోగభృతి, తల్లికి వందనం, ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ పథకం కింద ఏటా రూ.20 వేలు ఆర్థికసాయం, ప్రతి మహిళకు నెలకు రూ.1500, ప్రతి ఇంటికి ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, బిసి, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనారిటీలకు 50 ఏళ్లకే ఫించన్ పథకం వంటి సంక్షేమ పథకాలు అమలు చేయలేదని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలు ఎప్పటి నుండి అమలవుతాయే స్పష్టత ఇవ్వాలని తులసిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

భారీగా నకిలీ వికలత్వ పింఛన్లు.. నోటీసులు జారీ

ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రభుత్వం అందిస్తున్న పలు సామాజిక పింఛన్లలో భారీస్థాయిలో నకిలీవి ఉన్నట్లు తెలుస్తోంది. కొందరు అక్రమార్కులు నకిలీ వికలత్వ పత్రాలు సృష్టించి ప్రభుత్వాన్ని, అధికారులను మోసం చేస్తున్నారని ఆరోపణలున్నాయి. చెవిటి, గుడ్డి, మూగ, అంగ వైకల్యం పేరుతో ఇతర జిల్లాల్లో నకిలీ పత్రాలు పొంది పింఛన్ తీసుకుంటున్న వారిని గుర్తించి ఉన్నతాధికారులు నోటీసులు అందజేశారు. మండల వ్యాప్తంగా 19 గ్రామ పంచాయతీలకు సంబంధించి 12 సచివాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలోని గ్రామ పంచాయతీలు, గ్రామాల్లో 1,146 మంది వికలత్వ పింఛన్ తీసుకుంటున్నట్లు ఎంపిడిఒ చంద్ర మౌళీశ్వర్ తెలిపారు. వీరిలో ఇతర జిల్లాల నుంచి సదరం క్యాంపులో వికలత్వ పత్రాలు పొందిన 168 మందిని మళ్లీ ధ్రువీకరణ చేసేందుకు ఉన్నతాధికారులు నోటీసులు జారీ చేశారన్నారు. ఇందులో అత్యధికంగా నల్లబల్లె గ్రామ సచివాలయం పరిధిలో 44 పింఛన్లు ఉన్నాయి. వేల్పుచెర్లలో 26, నల్లబల్లె 9, చిన్నదుద్యాల 5, పెద్దదుద్యాల 3, రాఘవాపురంలో ఒకరు పింఛన్లు తీసుకుంటున్నారు. వీరికి అధికారులు నోటీసులు జారీ చేశారు. తిమ్మాపురం సచివాలయం పరిధిలో 41 పింఛన్లు ఉన్నాయి. ఇందులో ఒక తిమ్మాపురం గ్రామంలోనే 31, రాజుల గురువాయపల్లెలో 5, కొసినేపల్లెలో 5 మంది ఫించన్ తీసుకుంటున్న వారికి నోటీసులు అందించారు. శెట్టివారిపల్లె సచివాలయం పరిధిలో 17 ఉన్నాయి. ఇందులో మంగపట్నం 6, శెట్టివారిపల్లె 9, కమ్మవారిపల్లె, కోడిగాండ్లపల్లెలో ఒకొక్కటి చొప్పున ఉన్నాయి. ఉప్పలూరు సచివాలయం పరిధిలో ఉప్పలూరులో 7, చిన్నకత్తెర పల్లె 1, బొందలకుంట పరిధిలో బొందలకుంటలో 12, ఆరవేటిపల్లెలో 2 ఉన్నాయి. వీరందరికి ప్రభుత్వం నోటీసులు జారీ చేసినట్లు ఎంపడిఒ తెలిపారు. కొలవలి పరిధిలో 14 ఉన్నాయి. వీటిలో ఆకుతోటపల్లెలో 2, కాండ్లోపల్లె 6, కొలవలి 6 ఉన్నాయి. మిగతా సచివాలయాల్లో అరకొరగా పింఛన్లు ఉన్నాయి. ప్రభుత్వం దృష్టికి రాని పింఛన్లు ఇంకెన్ని ఉన్నాయోనని ప్రజలు చర్చించుకుంటున్నారు. నకిలీ పింఛన్లు అరికట్టేందుకు ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న రమేష్‌రెడ్డి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

స్థానిక పిహెచ్‌సిని డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ టీం రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు గర్భిణులు, చిన్నపిల్లలకు అందుతున్న టీకాలు, సేవలపై ఆరా తీశారు. గర్భిణుల్లో రక్త శాతం ఎంత ఉండేది పరీక్షించి తగిన సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ మల్లేష్, డాక్టర్ సంపత్‌కుమార్, డిపిహెచ్ఎన్ఒ అరుణ, సిహెచ్ఇ సాంబశివారెడ్డి, ఎన్‌హెచ్‌ఎం నారాయణ, ఏఎస్ఒ జాకోబు, సూపర్వైజర్లు పుష్పరాజు, రమణమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చదనాన్ని పెంచండి.. పర్యావరణాన్ని కాపాడండి

ప్రజాశక్తి - మైదుకూరు

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని పట్టణంలోని లిటిల్ స్కాలర్స్ గ్లోబల్ స్కూల్ విద్యార్థులు గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పర్యావరణాన్ని పరిరక్షించాలని.. గో గ్రీన్ సేవ్ లైఫ్ అంటూ నినాదాలు చేస్తూ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు పర్యావరణ పరిరక్షణలో భాగంగా చెట్ల ప్రాముఖ్యతను తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని సూచించారు. ప్రతి ఏడాది జూలై 25న ఒక మొక్కను నాటడమే కాకుండా దానిని సంరక్షించి పెద్ద చేసే బాధ్యతను తీసుకోవాలని కోరారు. ర్యాలీలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మైదుకూరులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



చిన్నగురవలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - చాపాడు : డయేరియాపై అప్రమత్తంగా ఉండాలని చిన్నగురవలూరులోని శ్రీస్వామి వివేకానంద విద్యానికేతన్ పాఠశాల కరస్పాండెంట్ బిఎన్ నాగేశ్వరరెడ్డి తెలిపారు. గ్రామంలో గురువారం శ్రీస్వామి వివేకానంద విద్యానికేతన్ విద్యార్థులు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సిబ్బంది ఆధ్వర్యంలో అతిసార వ్యాధి నివారణ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ తాగునీటి విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాల న్నారు. భోజ నానికి ముందు.. మల, మూత్ర విసర్జన అనంతరం కాళ్లు, చేతులు శుభ్రపర చుకొ వాలన్నారు. పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా శుభ్రంగా ఉంచు కోవాలన్నారు. కార్యక్రమంలో సిహెచ్ఒ శివమ్మ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉమ్మడి వనరులను భావితరాలకు అందించడమే లక్ష్యం

బ్రహ్మంగారిమఠం : ఉమ్మడి వనరులను గుర్తించి భావితరాలకు అందించడమే లక్ష్యమని ఫెడరేషన్ ఫర్ ఎకనాలజికల్ సెక్యూరిటీ కడప జిల్లా మేనేజర్ స్నేహష్, క్లస్టర్ కో-ఆర్డినేటర్ లావణ్య పేర్కొన్నారు. ఉపాధి హామీ భవనంలో గురువారం మండల స్థాయి ఉమ్మడి వనరుల అభివృద్ధి సమితి సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామస్థాయిలో ఉన్న ఉమ్మడి వనరులను గుర్తించి అభివృద్ధి చేస్తామన్నారు. ఉమ్మడి వనరుల అభివృద్ధి సమితి మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా ఎర్రంపల్లి రవి, కార్యదర్శిగా సోమిరెడ్డిపల్లి ఓబులేసు, సహాయ కార్యదర్శిగా జాల హృదయ్‌నాథ్, ఉపాధ్యక్షులుగా నాగిపోగు పుల్లయ్య, కమిటీ సభ్యులుగా అశోక్, గురుబ్రహ్మం, శాంతయ్య, రామయ్య, జ్యోష్ణ, ప్రభుకుమార్, రవి ఎన్నుకున్నారు.



నూతన కార్యవర్గంతో సిఐటియు నాయకులు

క్యాబ్ డ్రైవర్లను మున్సిపాలిటీ పరిధిలోకి తీసుకోవాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

క్యాబ్ డ్రైవర్లను మున్సిపాలిటీ పరిధిలోకి తీసుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ కోరారు. స్థానిక మున్సిపాలిటీలో కాంట్రాక్ట్ కింద క్యాబ్ డ్రైవర్లుగా పనిచేస్తున్న 35 మంది సిఐటియులో గురువారం సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ క్యాబ్ డ్రైవర్లకు మున్సిపాలిటీలో డ్రైవర్లకులాగానే వేతనం ఇవ్వాలని కోరారు. జీఓ నెం.39 ప్రకారం రూ.24,500 వేతనం ఇవ్వాలన్నారు. పెండింగ్‌లు ఉన్న పీఎఫ్, ఈఎస్ఐ డబ్బులు వారి ఖాతాల్లో వేయించాలన్నారు. క్యాజువల్ లీవ్ ఇవ్వాలని, కొబ్బరినూనె, సబ్బులు, చెప్పులు అందజేయాలన్నారు. యూనిఫాం ఇవ్వాలన్నారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్‌కుమార్ సిఐటియులో చేరిన కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ కార్మిక సంఘం కార్య దర్శి, కోశాధికారి రాఘవేంద్ర మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు సిఐటియు అండగా ఉంటుందన్నారు. క్యాబ్ డ్రైవర్ల సంఘం అధ్యక్షుడుగా జూటూరు శ్రీని వాసులు, ప్రధాన కార్యదర్శిగా ఆర్.పవన్‌కుమార్, కోశాధికారిగా జి.రాజకుమార్, ఉపాధ్యక్షులుగా ఐ.మహేశ్‌బాబు, ఎన్ సుబ్బారాయుడు, జి.విజయరాజు, సహాయ కార్యదర్శులుగా ఎం.మదన్, కె.కిరణ్‌కుమార్, కె.తరుణ్ ఎంపికయ్యారు.

జగన్‌కు రాజకీయ జీవం పోస్తున్న టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

తెలుగుదేశం పార్టీ శ్రేణులు సమన్వయం పాటించక ప్రజలు తిరస్కరించిన వైసిపికి రాజకీయంగా జీవం పోస్తూ ఉండడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందని జిల్లా టీడీపీ కార్యనిర్వాహణ కార్యదర్శి ఎస్పీ మహబూబ్ హుస్సేన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వైనాట్ 175అంటూ ఎన్నికలకు వెళ్లిన జగన్‌మోహన్‌రెడ్డికి ఆంధ్ర ప్రజలు దిమ్మతిరిగేలా అపజయాన్ని అంటగట్టారన్నారు. 175నుంచి కేవలం 11స్థానాలకే పరిమితం చేశారన్నారు. అసెంబ్లీలో అడుగు పెట్టడానికి కూడా మెహమాటపడి వేరే దారులు వెతుక్కునే ఆత్మ సంరక్షణలో పడ్డ జగన్ రోజూ రోడ్ల పైకి వచ్చి ధర్నాలు చేసే స్థితికి రావడానికి కారణం కేవలం టిడిపి కార్యకర్తలు, పార్టీ శ్రేణుల సమన్వయ లోపమే అన్నారు. రాజకీయ జయాపజయాలు ప్రజల మనోభీష్టంపై ఆధారపడి ఉంటాయన్నారు. అవి మారడానికి ఎంతో కాలం పట్టదన్నారు. పిల్లిని చూసీచూడనట్లు వదిలేస్తే మౌనంగా వెళ్లి పోతుంది. గోడకు ఆనుకునేంత వెంటాడితే అది తిరగబడుతుందన్నారు. టిడిపి కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి నాయకులం మన అధినేత చంద్రబాబు ఇబ్బంది పడేలా చేయకూడదన్నారు. మనం సమన్వయం పాటిస్తే వైసిపి రాష్ట్రం నుంచి నిష్క్రమిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది బడ్జెట్లో మిత్రధర్మాన్ని పాటించి కేటాయించిన కేటాయింపుల వల్ల రాష్ట్రానికి జరిగిన మేలును చాటుదామని ఆయన సూచించారు.

ధర్నా చేయడం జగన్ నిరంకుశత్వానికి నిదర్శనం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

హత్యలపై మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీలో ధర్నా చేయడం ఆయన నిరంకుశత్వానికి నిదర్శనమని తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి తుమ్మలూరు మల్లికార్జున పేర్కొన్నారు. మండలంలోని పొన్నతోట గ్రామంలో గురువారం ఆయన మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అధిక ప్రాధాన్యత ఇచ్చినందుకు ఆ ప్రభుత్వానికి, అందుకు కృషి చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా తెలుగు రైతు సంఘం తరుపున తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి తుమ్మలూరు మల్లికార్జున కతజ్ఞతలు తెలిపారు. గురువారం మండల పరిధిలోని పొన్నతోట గ్రామంలో ఆయన మాట్లాడుతూ కేంద్రం నుండి విభజన చట్టం ద్వారా రావాల్సిన నిధులలో భాగంగా అమరావతి నిర్మాణం కోసం రూ.15 వేల కోట్లు, పోలవరం ప్రాజెక్టు పూర్తికి సహకారం ఇవ్వడం అభినందనీయం అన్నారు.

మహిళల పట్ల వేధింపులకు పాల్పడితే శిక్ష

ప్రజాశక్తి - చక్రాయపేట



మాట్లాడుతున్న ఐసిడిఎస్ సిడిపిఒ సునీత

మహిళల పట్ల వేధింపులకు పాల్పడితే శిక్ష తప్పదని ఐసిడిఎస్ సిడిపిఒ సునీత పేర్కొన్నారు. వెలుగు కార్యాలయంలో గురువారం మహిళల లైంగిక వేధింపుల నివారణ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సిడిపిఒ సునీత, ఎంపీడీవో సోమశేఖర్, ఎస్ఐ వినోద్‌కుమార్, చక్రాయపేట వైద్యాధికారి వాణి హాజరయ్యారు. కార్యక్రమంలో ఏపీఓ రవి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు సుభాషిణి, సుభద్ర, అంగనవాడీ కార్యకర్తలు, సచివాలయాల మహిళా పోలీసులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ సెక్రటరీలు, జిఎంకేలు, వెలుగు సీసీలు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - చాపాడు

కేఎస్ఆర్ హరిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో పల్లవోలు కాశిరెడ్డి నాయన వృద్ధాశ్రమంలో మడూరు ప్రతాపరెడ్డి వర్ధంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమం, దుస్తుల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ ప్రతాప్‌రెడ్డి కుమారుడు వినయ్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంతోమంది పేదలకు సాయం చేయడం, ప్రతి సంవత్సరం ప్రతాప్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆశ్రమాలు, రోడ్లపై ఉన్న వారికి అన్నదానం చేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఎంపిఆర్ సభ్యులు, కెఎస్ఆర్ హరిత ఫౌండేషన్ సభ్యులు సంజీవ రాయుడు, రాయుడు పాల్గొన్నారు.